రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం



గిడ్డయ్య (ఫైల్)




శశికళ (ఫైల్)



లక్ష్మి (ఫైల్)



చంద్రమ్మ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన వాహనం

- 14 మందికి తీవ్ర గాయాలు
- శ్రీశైలానికి వెళ్లి వస్తుండగా ఘోర దుర్ఘటన
- కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ట్రాలీ వాహనం బోల్తా
- మృతులందరూ ఆదోని ప్రాంత వాసులే
- ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

ఆత్మకూరు/ ఆదోని/కర్నూలు, మే 2(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలు పదో తరగతిలో పాసయ్యారన్న సంతోషంతో వారందరూ బంధుమిత్రులతో కలిసి శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారిని మృత్యువు కబళించి విషాదాన్ని నింపింది. వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి ఏకంగా నలుగురి ప్రాణాలు కోల్పోయారు. 14 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం చెరువు కట్ట సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. ఆదోని పట్టణంలోని రాయచోటి సుబ్బయ్యనగర్, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్‌తో పాటు గోనెగండ్ల మండలంలోని ఎర్రపాడు గ్రామానికి చెందిన సుమారు 28 మంది బంధుమిత్రులు గురువారం శ్రీశైలానికి ప్రైవేట్ వాహనంలో బయలుదేరి వెళ్లారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం శుక్రవారం మధ్యాహ్నం శ్రీశైలం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలోనే సిద్ధాపురం చెరువు కట్ట ఎదురుగా మరో వాహనం వస్తుండగా ఒక్కసారిగా డ్రైవర్ బ్రేక్ వేశాడు. వర్షం కురవడం వల్ల రహదారి చిత్తడిగా మారి వాహనం అదుపుతప్పి కుడిపక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో చెక్కలను ఏర్పాటు చేసుకుని పైభాగంలో కూర్చున్నవారు కింద పడగా వారిపై వాహనం బోల్తాపడి తిరిగి యథాస్థితిలో నిలిచింది. ఈ ఘోర దుర్ఘటనలో ఆదోనిలోని ఇందిరానగర్‌కు చెందిన గిడ్డయ్య (42), శశకళ (40), లక్ష్మి (28) అక్కడికక్కడే మృతిచెందగా మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌తో పాటు పలు ప్రైవేట్ వాహనాల్లో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చంద్రమ్మ (31) మృతిచెందింది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రులు లోకేశ్, భరత్, ఎమ్మెల్యే బుడ్డా

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు మృతిచెందడంతో పాటు 14 మంది తీవ్ర గాయాలపాలైన ఘటనపై మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేలా అధికారులను ఆదేశించారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

14 మందికి తీవ్ర గాయాలు

ఈ ప్రమాదంలో ఆదోనిలోని ఇందిరనగర్‌కు చెందిన సరస్వతి, వీణ, రాయచోటిసుబ్బయ్య కాలనీకి చెందిన మంగలి రంగస్వామి, రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మంగలి గిరిధర్, మంగలి రాములమ్మ, 12 ఏళ్ల ప్రవీణ్ తేజ, గోనెగండ్ల మండలంలోని ఎర్రపాడుకు చెందిన కురువ కుమార్, మంగలి శిల్పా, మంగలి వీరేష్, మంగలి గోపిచంద్, 7ఏళ్ల హర్షిణి, డ్రైవర్ సునీల్‌కుమార్‌తో పాటు మరొకరు గాయపడ్డారు. వీరిలో రంగస్వామికి మోకాళ్లు, మోచేతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరేష్, గిరిధర్‌లకు గడ్డం భాగంలో బలమైన రక్తగాయాలయ్యాయి. శిల్పాకు తలపై తీవ్ర గాయమైంది. ప్రవీణ్‌తేజ అనే బాలుడికి కుడికాలు విరిగింది. స్వల్ప గాయాలైన వారిని ఆత్మకూరులోనే చికిత్సలు అందించగా తీవ్ర గాయాలైన వారిని 108 అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్సై నారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చొరవ తీసుకున్నారు.



మల్లన్నను దర్శించుకున్న తర్వాత భోజనం అనంతరం తీసుకున్న గ్రూప్ ఫొటో

డిగ్రీ పరీక్షలు ఉన్నాయని ఆగిపోయా



డిగ్రీ పరీక్షలు ఉన్న కారణంగా మా అమ్మ శశికళ ఇంటి దగ్గరే ఉండమన్నది. సెలవులు ఉన్నందున కర్ణాటక నుంచి అక్క లక్ష్మి కూడా ఇంటికి రావడంతో, ఇంటి దగ్గరే ఉండిపోయాను. లేదంటే అమ్మతో పాటు నేను కూడా దైవదర్శనానికి వెళ్లి ఉండేవాడిని.

-అశోక్

మా అమ్మ బాగుందని చెప్పండి అంకుల్

మా అమ్మ శశికళకు ఏమి కాలేదని, బాగుందని చెప్పండి అంకుల్.. అంటూ.. మృతురాలు శశికళ కూతురు లక్ష్మి, కుమారుడు అశోక్ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. దైవదర్శనానికి వెళ్లిన వారందరూ కూడా ఒకే కుటుంబసభ్యులేనని, తమ తల్లిదండ్రులకు ఎలా ఉందంటూ ఆరాతీశారు.

గూడ్స్ వాహనాల్లో ప్రయాణం వద్దంటున్నా..

ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాలకు చెందిన గూడ్స్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదమని తెలిపినా వాటినే ఆశ్రయిస్తున్నారు. శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా ఇదే తరహాలో బొలేరో, ఆటో ట్రాలీలపై చెక్క పలకలు వేసుకుని అధిక సంఖ్యలో వెళ్తుంటారు. ఆ సమయంలో పోలీసు, రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి గూడ్స్ వాహనాల్లో ప్రయాణాలపై నిషేధం విధించినా చాలా వరకు గూడ్స్ వాహనాల్లోనే ప్రయాణం కొనసాగించేవారు. సురక్షితమైన ప్రయాణం చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మృతుల్లో ఇద్దరు తోడికోడళ్లు.. మరొకరు ఆడపడుచు

రోడ్డు ప్రమాదంలో చనిపోయినవారిలో ఇద్దరు తోడికోడళ్లు, వారి ఆడపడుచు ఉన్నారు. సెలూన్ షాప్ నిర్వహిస్తూ బతుకుబండి సాగిస్తున్న అన్నదమ్ములు, బావమర్దుల కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. ఆదోని పట్టణం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన ఎం.రాజు, గిరి అన్నదమ్ములు. వీరికి గిడ్డయ్య, రంగస్వామి, రామాంజీ బావమరుదులు. వీరంతా రాజీవ్‌గాంధీ నగర్, ఇందిరానగర్‌లో ఉంటున్నారు. వేసవి సెలవులు కావడంతో ఈ ఐదు కుటుంబాలతో పాటు గోనెగండ్ల మండలం ఎర్రబాడుకు చెందిన బంధువులు దాదాపు 28 మంది ట్రాలీ ట్రాలీ వాహనంలో శ్రీశైలం వెళ్లారు. రామాంజీ కుమారుడు అరవింద్, గిడ్డయ్య కుమారుడు అభి, రాజు కుమార్తె అర్చన్ పదో తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కు తీర్చుకోవాలని శ్రీశైలం వెళ్లారు. ఈ ప్రమాదంలో రాజు భార్య లక్ష్మి, గిరి భార్య చంద్రమ్మ మృతి చెందారు. రాజు అక్క శశికళ, బావమరిది గిడ్డయ్య మృత్యువాత పడ్డారు. మృతురాలు లక్ష్మికి భర్త, ఇద్దరు కూతుళ్లు, కొడుకు, చంద్రమ్మకు కొడుకు, కూతురు, శశికళకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గిడ్డయ్యకు కొడుకు, కూతురు ఉన్నారు.



అయ్యో.. ఆర్‌యూ

- విశ్వవిద్యాలయ లైబ్రరీలో పుస్తకాలకు చెదలు
- 19 విభాగాల్లో వైఫై టెక్నాలజీ నిరుపయోగం
- రూ. కోట్లతో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు..
- ఎంఈడీలో నిరుపయోగంగా ఉన్న రూ. కోట్ల పరికరాలు
- గెస్టు హౌస్ ఉన్నా ప్రైవేట్ లాడ్జీలకు ఏటా రూ. 5 లక్షలు
- ఐడీ కార్డు లేకుండానే విద్యార్థుల చదువులు

విశ్వవిద్యాలయాలు భావ సంఘర్షణ కేంద్రాలుగా వికసించాలి. నిరంతర నూతన అధ్యయనాలకు నెలవు కావాలి. ప్రజలు గర్వించదగ్గ మేధావులుగా ఆచార్యులు విద్యార్థులను ప్రభావితం చేయాలి. దేశ మేధో అవసరాలు తీర్చే సృజనాత్మక పరిశోధనలు జరుగుతూ ఉండాలి. విషాదకరంగా ఇవేవీ రాయలసీమ విశ్వవిద్యాలయంలో లేవు. అక్కడ గ్రంథాలయంలోని పుస్తకాలు చెదపట్టిపోతున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించిన పరికరాలు, సాంకేతిక ఏర్పాట్లు నిరుపయోగంగా తయారయ్యాయి. చివరికి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ల నిర్వాకానికి, అధికారుల నిర్లక్ష్యానికి ఇది చాలు. నిత్యం అంతర్గత వివాదాలతో ఆర్‌యూ కునారిల్లిపోతున్నదని, బోధన, అధ్యయనం, పరిశోధన ఊసే లేదనే విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఉపకులపతులు ఏసీ గదులకే పరిమితం కావడం, అధ్యాపకులు చదువులు చెప్పక పోవడం, అసలు విశ్వవిద్యాలయం సమాజంలో భాగమనే స్పృహ లేకపోవడం వంటి జాడ్యాలతో నిరాశాపూరిత వాతావరణం నెలకొని ఉంది. ఆర్‌యూ ఎన్నటికైనా సరైన దారిలోకి వస్తుందా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కర్నూలు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయ పాలన పూర్తిగా గాడి తప్పింది. గతంలో వర్శిటీ ఖజాన నుంచి దాదాపు రూ. 20 కోట్లతో భవనాలు, పరికరాలు, గెస్టు హౌస్ లాంటి సౌకర్యాలను కల్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని సెంట్రల్ వర్శిటీ స్థాయిలో సౌకర్యాలు సమకూర్చాలనే లక్ష్యంతో నిధుల కేటాయించారు. నిర్మాణాలు చేపట్టారు. ఆధునిక టెక్నాలజీ సౌకర్యాలు సమకూర్చారు. అయితే వాటిని సద్వినియోగం చేసుకునేందుకు సరైన అధికారులు, సూచనలు చేసే నాయకత్వం లేదు. ప్రొఫెసర్లు తమ ఆధిపత్యం కోసం విద్యార్థులను వర్గాలుగా చీల్చి ఓ సామాజిక వర్గం పేరు చెప్పుకుని వారి అండతో భూములను కాజేసి, విలువైన ఆస్తులను నిర్వీర్యం చేస్తూ అభివృద్ధికి ఆటంకంగా మారారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులకు చదువు చెప్పడంలో ప్రొఫెసర్లు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నియమించిన కొత్త ఉపకులపతి అయినా వీటిపై దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకరావాలని, ఉచిత వైఫై అందుబాటులోకి తీసుకు రావాలని విద్యార్థులు కోరుతున్నారు.

2008 వర్శిటీలో రూ. 8 కోట్లతో సెంట్రల్ యూనివర్సిటీ తరహాలో వర్శిటీలో అండర్ గ్రౌండ్ టెక్నాలజీతో యూనివర్సిటీలో 19 విభాగాలతో ఉచితంగా విద్యార్థులకు అందించేందుకు వైఫై టెక్నాలజీని తీసుకువచ్చారు. కానీ ముచ్చటగా 6 నెలలు మాత్రమే విద్యార్థులకు ఉపయోగపడింది. ఆ తర్వాత నిరుపయోగంగా మారింది. ఆదే విధంగా వర్శిటీలో ఎంబీఏ విభాగం ఏర్పాటు అయ్యాక వాటికి ప్రత్యేకమైన లైబ్రరీ ఏర్పాటు చేసి రూ. 25 లక్షలతో పుస్తకాలు కొన్నారు. కానీ వాటికి నేటికి అడిట్ లేదు... అధికారి లేదు. వినియోగం లేక పుస్తకాలకు చెదపడుతున్నాయని విద్యార్థులు అంటున్నారు.



డేటా సెంటర్



లైబ్రరీ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనింగ్ ల్యాబ్

ఎడ్యుకేషన్ విభాగం కోర్సు ప్రారంభంలో కోర్సు ఉపయోగం కోసం విద్యార్థులకు నూతన టెక్నాలజీ కోసం కోట్ల రూపాయలు కేటాయించి పరికరాలు కొన్నారు. ప్రస్తుతం కోర్సు రద్దు కావడంతో పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. వర్శిటీలో పాత లైబ్రరీ, 3వ బిల్డింగ్‌తోపాటు బాలుర వసతి గృహంలో తుంగభద్ర, కృష్ణ బిల్డింగ్, మెస్ హాలు, క్యాంటీన్, బిల్డింగ్‌లు ఖాళీగా ఉండటంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

మరుగున పడ్డ గెస్టు హౌస్.. ప్రైవేట్ లాడ్జీల కోసం ఏటా. 5 లక్షలు

రాయలసీమ యూనివర్సిటీలో గెస్టు హౌస్ కోసం గతంలో రూ. 2 కోట్ల వర్శిటీ నిధులతో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఆలనా పాలన లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. ఉన్న వాటిని ఉపయోగించుకోకుండా వచ్చిన అతిథుల కోసం ప్రైవేట్ లాడ్జిలపై ఆధార పడుతున్నారు. దీని వల్ల ప్రతి ఏటా లాడ్జీలకు వర్శిటీ నిధుల నుంచి దాదాపు రూ. 5 లక్షల వరకు తగలేస్తున్నారని విద్యార్థులు విమర్శిస్తున్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు లేవు

వర్శిటీలో చదివే విద్యార్థులకు జాయిన్ అయ్యాక ప్రారంభంలోనే ఐడీ కార్డు వర్శిటీ అధికారులు ఇస్తారు. కానీ గత కొన్ని సంవత్సరాల నుంచి విద్యార్థులకు ఐడీ కార్డు ఇవ్వడం లేదు. ఇటీవల కొత్త ఉపకులపతి వద్ద విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తమకు ఐడీ కార్డులు మంజూరు చేయాలని వేడుకున్నారు.

కొత్త అకడమిక్‌లో ప్లాన్ చేస్తా

వర్శిటీ క్యాంపస్‌లో నిరుపయోగా చాలా బిల్డింగ్‌లు ఉన్నట్టు కొంత మంది విద్యార్థులు తెలిపారు. వేసవి సెలవుల్లో పరిశీలించి కొత్త అకడమిక్ ఇయర్‌లో తగిన ప్లాన్ చేస్తాం. ఇంజనీరింగ్ కళాశాలకు కొత్త ల్యాబ్స్ మంజూరు అయ్యాయి. విద్యార్థుల అవసరాల కోసం నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగం చేసే దిశగా ప్రయత్నిస్తాం.

- వి. వెంకట బసవరావు, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ

వర్సిటీకి మంచి పేరు తేవాలి

డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు సభలో ఉపకులపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను పూర్తి చేసుకొని బయటికి వెళ్తున్న విద్యార్థులు తల్లిదండ్రులకు, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఉపకులపతి వి. వెంకట బసవ రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయలసీమ యూనివర్సిటీలోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో ద్వితీయ సంవత్సరం వీడ్కోలు ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కారంతోనే చదువుకు సార్థకత చేకూరుతుందని అన్నారు. ఆ దిశగా విద్యార్థులంతా కృషి చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. పోటీ పరీక్షలకు హాజరై జీవితంలో వీలైనంత త్వరగా స్థిరపడాలని హితవు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడాంశాలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ బి. విజయకుమార్, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్స్ సుందరానందపుచ్చా, ఆర్. భరత్ కుమార్, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): కిషోర వికాసం ద్వారా బాలికల సర్వతో ముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కిషోరి-వికాసం- వేసవి శిక్షణా కార్యక్రమాల ప్రణాళిక (మే 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు) పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కిషోరీ వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం వ్యక్తిగత శుభ్రత వంటి 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నిర్మల, డీఎంహెచ్‌వో శాంతికళ, డీసీపీవో శారద, లీగల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, సామాజిక కార్యకర్త నరసింహులు, కౌన్సిలర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తుది కసరత్తు

- అమరావతి పునర్నిర్మాణ సభలో సీఎం చంద్రబాబు
- మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు సహా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు

6





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



● కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

● సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు



మహిళల విజయ దరహాసం





సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు

ప్రజల సొమ్ము దుర్వినియోగం

● అప్పు తెచ్చి రాజధాని నిర్మాణం చేపట్టడం విడ్డూరం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని అమరావతి పర్యటనలో ప్రజల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో చంద్రబాబు హయాంలో పిడికెడు మట్టి, చెంబు నీళ్లు తీసుకువచ్చిన నరేంద్ర మోదీ.. ఇప్పుడొచ్చి ఏమి చేయబోతున్నారో తెలియాలని అన్నారు. మోదీ పర్యటనకు 6 వేల బస్సులను ఉపయోగించి ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో నరేంద్ర మోదీ రాష్ట్రానికి అప్పులు తప్ప ఏమీ ఇవ్వడం లేదన్నారు. లక్ష కోట్ల రూపాయలు అప్పు తెచ్చి రాజధాని నిర్మాణం చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, ప్రాంతాల మధ్య వివాదం ఉండకూడదనే వైసీపీ ఉద్దేశమని అన్నారు. సమావేశంలో నగర మేయర్ బీవై రామయ్య, కార్పొరేటర్లు మునెమ్మ, విక్రమసింహారెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, రాజేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

● 67 శాతం అర్హత సాధించిన విద్యార్థులు

● ఉమ్మడి జిల్లాల్లో 93 మార్కులతో టాపర్‌గా నిలిచిన షేక్ షఫీ



నంద్యాల ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో 1733 మంది విద్యార్థులు అర్హత మార్కులు సాధించారు. 2948 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 2586 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 67శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల పట్టణం బొమ్మల సత్రం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న షేక్ షఫీ, షేక్ హసీనాల కుమారుడు షేక్ సరోజ్ 100కి 93 మార్కులు సాధించి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల టాపర్‌గా నిలిచి నంద్యాల చాపిరేవుల మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యాడు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తుది కసరత్తు



ప్రధాని మోదీ హాజరైన అమరావతి పునర్నిర్మాణ సభలో జాతీయ జెండాతో మంత్రి టీజీ భరత్, ఇతర మంత్రులు

● ఆ దిశగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం

● కేంద్ర నిధులతో ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి

● రానున్న డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలు

● అమరావతి పునర్నిర్మాణ సభలో సీఎం చంద్రబాబు

● వెనుకబడిన రాయలసీమపై ప్రత్యేక ఫోకస్

● మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు సహా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు

కర్నూలు, మే 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శుక్రవారం అమరావతి పునర్నిర్మాణ సభ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన, ఉమ్మడి జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ అభివృద్ధిపై ఫోకస్ పెట్టామని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తుది కసరత్తులో భాగంగా వేగంగా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. . ఓర్వకల్లు కారిడార్‌ను కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయబోతున్నామని, ఓర్వకల్లు కేంద్ర ఏరోస్పేస్ డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ పవర్ యూనిట్లు రాబోతున్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు ప్రసంగంలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. నవ్యాంధ్ర దిశను మార్చే ప్రధాని మోదీ పాల్గొన్న సభలో కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలు, అభివృద్ధిపై చంద్రబాబు ప్రసంగించడంతో .. రాబోయే రోజుల్లో ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతుందని, హైకోర్టు బెంచ్ హామీ అమలుకు చంద్రబాబు చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నారని మంత్రి టీజీ భరత్, టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. ఆ వివరాలు పరిశీలిస్తే..

కేంద్ర నిధులతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేంద్ర నిధులు ఇచ్చింది. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక పురోగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ అభివృద్ధిలో భాగంగా నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ) ఫేజ్-1 కింద రూ.2.786 కోట్లతో 2,612 ఎకరాల్లో అభివృద్ధికి డిజైన్ చేశారు. వివిధ పరిశ్రమలు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. ఇక్కడ రూ.100 కోట్లతో డ్రోన్ సిటీ ఏర్పాటుకు గరుడ ఏరో స్పేస్ సంస్థ కసరత్తు తుది దశకు చేరింది. ఇప్పటికే భూములు కూడా పరిశీలించారు. ఆ సంస్థ సీఈవో అగ్నీశ్వర్‌జయప్రకాశ్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్‌నాయుడుతో చర్చించారు. ఇప్పటికే ప్రపంచంలోనే తొలి 1000 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ పార్కు, 3,680 మెగావాట్ల పంప్డ్‌స్టోరేజీ పవర్ యూనిట్లు వచ్చాయి. మరిన్ని గ్రీన్ ఎజర్జీ పవర్ ప్రాజెక్టులు రాబోతున్నాయని సీఎం చంద్రబాబు కరువుసీమ ప్రజలకు తీపి కబురు అందించారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు వేగంగా అడుగులు



ప్రధాని మోదీ పాల్గొన్న అమరావతి పునర్నిర్మాణ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమలో రక్షణ రంగ (డిఫెన్స్) సంస్థలు ఏర్పాటు చేశామని, హైకోర్టు బెంచ్ ఏర్పాటులో భాగంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. దీనిపై జిల్లా న్యాయవాదులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడు రాజధానుల పేరిట కర్నూలు న్యాయ రాజధాని అంటూ మాయమాటలతో మభ్యపెట్టారు. అయితే.. నాడు ప్రతిపక్ష నేత హోదాలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే ఇచ్చిన హామీ అమలులో ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబరు 21న అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బెంచ్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని కోరుతూ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి అక్టోబరు 28న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. ప్రధాని మోదీ పాల్గొన్న సభలో సీఎం చంద్రబాబు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై స్పష్టంగా వివరించడం పట్ల జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సభలో జిల్లా తెలుగు తమ్ముళ్లు

అమరావతి సభకు జిల్లాకు చెందిన పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.



చిప్పగిరి మండలం నంచర్ల దగ్గర మల్లప్పగేట్ రైల్వే స్టేషన్

రైల్వే, నేషనల్ హైవే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాన

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ అమరావతిలో శంకుస్థాపనలు చేశారు. రూ.695 కోట్లతో నంద్యాల జిల్లాలో చేపట్టిన 167కే జాతీయ రహదారి నిర్మాణం పనులు, రూ.293 కోట్లతో చేపట్టిన చిప్పగిరి మండలం మల్లప్పగేట్ (నంచర్ల) - గుంతకల్లు వేస్ రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) డబ్లింగ్ బైపాస్ రైల్వేలైన్‌కు శంకుస్థాపన చేశారు. గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్, విద్యుదీకరణ పనుల్లో భాగంగా రూ.184 కోట్లతో నిర్మించిన బి.సిమెంట్ నగర్ - కేఈఎఫ్ పాణ్యం మధ్య 19.04 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు.



అమరావతి సభలో జిల్లాకు చెందిన ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ఎంపికైన ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు



అమరావతికి చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి, చిత్రంలో సీఎం చంద్రబాబు

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

● గరిష్ఠ ధర క్వింటం రూ. 8,081



ఆదోని మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, మే 2(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. గరిష్ఠంగా క్వింటం రూ.8,081 పలికింది. గత వారంతో పోల్చితే క్వింటానికి రూ.150 తగ్గింది. ధరలు మరింత పెరుగుతాయని పత్తి రైతులు ఆశించారు. మళ్లీ ధరలు పతనమవుతుండడంతో నిరాశ చెందుతున్నారు. 478 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5 వేలు, మధ్యస్థ ధర రూ.7,675 పలికింది.

డెంగీ కేసు నమోదు

దేవనకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): దేవనకొండలో మూడేళ్ల బాలికకు డెంగీ బారిన పడిన్నట్లు వైద్యాధికారి విజయభాస్కర్ తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న బాలికను కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. రక్త పరీక్షలు నిర్వహించగా డెంగీ సోకినట్లు తేలింది. గ్రామాలలో అధిక జ్వరంతో బాధపడుతున్న వారు వైద్యశాలలో రక్తపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్యాధికారి సూచించారు. దేవనకొండలో పారిశుధ్య పనులు చేసి, దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. వైద్య సిబ్బంది రంగస్వామి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గూడూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. వివరాలు.. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన తిప్పన్న(26) బైక్‌పై పోలకల్ నుంచి గూడూరుకు వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ గూడూర్ సమీపంలో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తిప్పన్నకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

క్రిష్ణగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.హెచ్. ఎర్రగుడి గ్రామానికి చెందిన రైతు బంగారు గళ్ళి రమేష్ (32) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గ్రామస్థుల సహకారంతో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి రెండు ఎకరాల స్వంత పొలంతో పాటు నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మూడు సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తున్నాడు. పంటల సాగు కోసం రూ. 5లక్షలు అప్పు చేశాడు. అయితే పంటలు సరిగా రాక అప్పులు తీర్చే మార్గంలేక జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ పోస్టుల మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు హాస్పిటల్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించిన నాలుగు ఉద్యోగ కేటగిరీ అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టులు, సెలక్షన్ కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్లు నకలు సర్టిఫికెట్లతో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. హాజరు కాని అభ్యర్థుల ఎంపిక రద్దు చేస్తామని పేర్కొన్నారు.

కవులకు, కళాకారులకు పుట్టినిల్లు రాయలసీమ

అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి



కళాకారుడిని సత్కరిస్తున్న ప్రముఖులు

బనగానపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): కవులకు, కళాకారులకు పుట్టినిల్లు రాయలసీమ అని అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్‌లోని బీసీ గురెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు జితేంద్ర మిమిక్రీ కళా ప్రదర్శన, గిన్నీస్‌వరల్డ్ రికార్డు హోల్డర్ షేక్ కరీముల్లా బృందంచే జానపద నృత్యాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కరీముల్లా నటరాజ కళామందిర్ వారిచే కూచిపూడి, భరతనాట్యం జానపద నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డిని జీజీ వెంకటేశ్ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి నవీన్‌కుమార్ చౌదరి, గజల్ కళాకారుడు మహమ్మద్‌మియా, ఇనాయతుల్లా ఘనంగా సత్కరించారు. అనంతరం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అంటే కవులు, కళాకారులకు పుట్టినిల్లు అన్నారు. ప్రముఖ కవులు యోగి వేమన, అన్నమయ్య, పోతులూరు వీరబ్రహ్మంగారు, పుట్టపర్తి నారాయణాచార్యులు, గడియారం శేషాచలం వంటి ఎంతో మంది జన్మించిన నేల రాయలసీమ అన్నారు. ప్రస్తుత సమాజంలో కవులు, కళాకారులు నిరాదరణ గురికావడం బాధాకరమన్నారు. కవులు, కళాకారులను ఆదరించేవారు కరువయ్యారన్నారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కళాకారులే కీలక పాత్రధారులన్నారు. ప్రముఖ సినీ నటుడు సుమన్, శివారెడ్డి, జయప్రకాశ్‌రెడ్డి, గోరేటి వెంకన్న, గరికపాటి నరసింహారావు వంటి కళాకారులను ఆదరించిన ఘనత అరుణ భారతి సంస్థదని అన్నారు. జితేంద్ర మిమిక్రీ, కరీములా బృందం నిర్వహించిన జానపద నృత్యప్రదర్శలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అరుణభారతి సాహితీ సంస్థ కార్యదర్శి రామశేషయ్య, బలరామయ్య, భరతుడు, మగ్బుల్, బొబ్బల మహేశ్వరరెడ్డి, జ్యోతిష్యం వెంకటరాముడు పాల్గొన్నారు.

సీమకు తరతరాల అన్యాయం

● రూ.1500 కోట్లు కేటాయిస్తే 10లక్షల ఎకరాలకు సాగునీరు
● కర్నూలులోనే కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలి
● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



రుద్రవరంలో తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

రుద్రవరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమకు తరతరాలుగా పాలకులు అన్యాయం చేస్తూనే వస్తున్నారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని తహసీల్దారు కార్యాలయం ముందు రైతులతో కలిసి తెలుగుగంగ ప్రాజెక్టుపై ధర్నా నిర్వహించి తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా రాయలసీమ తాగునీటి, సాగునీటికై కేటాయించాలని అన్నారు. కృష్ణానది యాజమాన్యం బోర్డు కర్నూలులోనే ఏర్పాటు చేయాలని, రూ.1500 కోట్లు కేటాయిస్తే వచ్చే ఖరీఫ్ నాటికి పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలవుతుందని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో ప్లంజ్‌పూల్‌కు మరమ్మతు చేయాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు జీవితకాలం పెంచడానికి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రతి సంవత్సరం 30 లక్షల నుంచి కోటి ఎకరాలకు సరిపడే కృష్ణాజలాలు సముద్రంపాలు అవుతున్నాయన్నారు. తుంగభద్ర, కృష్ణా, పెన్నానదులు ఈ ప్రాంతం మీదుగా ప్రవహిస్తున్నాయని, రాయలసీమ ప్రాంతంలో సాగునీటికి పంట పొలాలకు పరిశ్రమలకు, విద్య, వైద్య సంస్థలకు అందించడానికి కావాల్సిన నీటి హక్కులున్నాయని అన్నారు. పాలకుల విధానాల వల్ల రాయలసీమ వెనుకబడిపోయిందని అన్నారు. కృష్ణాజలాలను సక్రమంగా వినియోగించుకోవడానికి క్రిష్ణానది యాజమాన్యం బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెలుగోడు రిజర్వాయరు, చెన్నై కాల్వ (తెలుగుగంగ కాల్వ) పూర్తి స్థామర్యంలో పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామగుర్విరెడ్డి, పార్థసారథిరెడ్డి, హరిక్రిష్ణ, రామక్రిష్ణారెడ్డి, మహబూబ్‌బాషా, దేవానందరెడ్డి, మహేంద్రరెడ్డి, వీరబ్రహ్మానందరెడ్డి, కొమ్ము శ్రీహరి పాల్గొన్నారు.

30వేల మందితో సిద్ధేశ్వరం అలుగు వార్షికోత్సవ సభ

ఈ నెల 31న సిద్ధేశ్వరం అలుగు 9వ వార్షికోత్సవం 30వేల జనాభాతో నిర్వహిస్తామన్నారు. జలమేజీవం, జలమే బలం, జలమే సర్వం అన్నారు. రాయలసీమలోని ప్రతి రైతు 31వతేదీన సంగమేశ్వరం చేరుకుని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ-శ్రమ్ కార్డులు అందేలా కృషిచేయాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి
● కార్మికులకు కార్డులు అందించేందుకు బృందాలు: అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు
● పారా లీగల్ వలంటీర్లకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు తమ ప్రాంతాల్లో ఉన్న అసంఘటిత కార్మికుల జాబితాను తయారుచేసి వారికి ఈ-శ్రమ్ కార్డులు అందేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పారా లీగల్ వలంటీర్లకు స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పలురంగాల్లో కార్మికులు ఉన్నారని, వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారాలీగల్ వాలంటీర్లు సహకరించాలని తెలిపారు. ఈ-శ్రమ్ కార్డులతో కలిగే ప్రయోజనాలను కార్మికులు వినియోగించుకోవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులు ఈశ్రమ్ కార్డుల కోసం ఈశ్రమ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న కార్మికులకు ఈశ్రమ్ కార్డులు అందజేసేందుకు పలు టీంలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు అసంఘటిత కార్మికుల జాబితాను రూపొందిస్తారని తెలిపారు.

భూ తగాదాలే హత్యకు కారణం

- కాంగ్రెస్ నేత హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- హత్య కేసులో 10 మందిపై కేసులు
- ముగ్గురిని అరెస్టు చేసిన అడిషనల్ ఎస్పీ
- పరారీలో ఏడుగురు నిందితులు



నిందితుల అరెస్టును చూపుతున్న అడిషనల్ ఎస్పీ

ఆలూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఏప్రిల్ 27వ తేదీన గుంతకల్ సమీపంలో టిప్పర్‌తో ఢీకొట్టి ఆపై వేట కొడవళ్లతో నరికి హత్య చేసిన కేసులో పోలీసులు లోతుగా విచారణ జరిపారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా నేతృత్వంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ హత్య కేసులో గుంతకల్‌కు చెందిన రాజేష్, బేఫర్ గౌసియా, కత్రిమాల సౌభాగ్యలను శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలో ఆలూరు రోడ్డులో గాయత్రి ఫంక్షన్‌హాల్ల వద్ద ఉన్న 1.10 ఎకరాల ఇళ్ల స్థలాల భూమి, సిద్ధార్థ కాలనీలో 9 ఎకరాల దేవదాయ భూమి, పెద్దన్నకు సంబంధించిన 8ఎకరాల భూమిని కాంగ్రెస్ నేత చిప్పగిరి లక్ష్మీనారాయణ అడ్డు వచ్చి తనకు కాకుండా చేసి ఆయనకు సహకరిస్తున్న రాజేష్, గౌసియాను దూషించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించడంతో కక్ష పెంచుకున్నారని, ఎలాగైనా లక్ష్మీనారాయణను హత్య చేయాలని రెండు నెలల క్రితం పథకం రూపొందించారని తెలిపారు. ఇందులో భాగంగానే ఓ టిప్పర్‌ను కొనుగోలు చేసి లక్ష్మీనారాయణ కదలికలను గమనిస్తూ రెక్కీ నిర్వహిస్తూ వచ్చారు. గత నెల 27వ తేదీన కె.పెద్దన్న ఇంటి వద్ద సమావేశమై హత్యకు పక్కాగా ప్లాన్ చేశారన్నారు. అనుకున్న విధంగానే గత నెల ఏప్రిల్ 27వ మధ్యాహ్నం 2:15 గంటలకు గుంతకల్ నుంచి చిప్పగిరికి ఇన్నోవా వాహనంలో వస్తుండగా రైల్వే బ్రిడ్జి వద్ద మొలగవల్లికి చెందిన మేకల శ్రీనివాసులు అతివేగంగా టిప్పర్‌తో ఢీకొన్నాడు. వెనక కారులో ఫాలో చేస్తూ వస్తున్న పెద్దయ్య, వడ్డే నవీన్ వెంటనే కారు అద్దాలు పగలగొట్టి వెంట తెచ్చుకున్న వేట కొడవళ్లతో, ఇనుప రాడ్లతో తలపై నరికి హత్య చేశారు. మిగిలిన వారు ఆ మార్గంలో ఎవ్వరూ రాకుండా జాగ్రత్తలు వహించి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఈ హత్య కేసులో మిగిలిన ముద్దాయిలు కె.పెద్దన్న, బోయ మేకల శ్రీనివాసులు, బోయ గోవిందు, బోయ రాము, వడ్డే నవీన్, ధర్మ, మనోహర్‌లను కూడా త్వరలో పట్టుకుంటామని అడిషనల్ ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బాధితులు ముందుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జునచౌదరి, చికెన్ రామాంజనేయులు, అరికెర మల్లేష్‌ల ప్రమేయం ఉన్నట్లు వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి ఆధారాలు ఇప్పటి వరకు లభించలేదన్నారు. ఈ హత్య కేసును లోతైన దర్యాప్తు చేసి ఇందులో ఇంకా ఎవరి పాత్ర ఉందో విచారణ చేపట్టి అందులో ఎవరు ఉన్నా కచ్చితంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పోలీసులపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. హత్యకు గురైన చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబానికి గన్‌మెన్‌లు ఇచ్చే అంశం తమ పరిధిలో లేదన్నారు. చిప్పగిరిలో ఆయన నివాసం ఉంటున్న కాలనీలో పోలీసు పికెట్ కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో పత్తికొండ డీయస్పీ వెంకటరామయ్య, సీఐ రవిశంకర్ రెడ్డి, ఆలూరు, హొళగుంద, చిప్పగిరి ఎస్ఐలు మహబూబ్‌బాషా, దిలీప్‌కుమార్, ఏపీ శ్రీనివాసులు ఉన్నారు.

ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాళ్లపై ఆర్జేడీ ఆగ్రహం

● సప్లిమెంటరీలోనైనా అందరూ పాసయ్యేలా చూడాలని ఆదేశం



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందిస్తున్న కడప ఆర్జేడీ శ్రీనివాసులు, జిల్లా అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ పరీక్షలో తక్కువ ఉత్తీర్ణత శాతం సాధించిన కళాశాల ప్రిన్సిపాళ్లపై ఇంటర్ బోర్డు రీజనల్ డైరెక్టర్ కడప ఏ. శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షకైనా క్లాసులను పకడ్బందీగా నిర్వహించి ఫెయిలైన విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఆర్జేడీ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళశాలలో ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కడప ఆర్జేడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ శాతాన్ని పెంచాలని తెలిపారు. అలాగే విద్యాసంవత్సర పని దినాలను 220 నుంచి 235 రోజులకు పెంచినట్లు తెలిపారు. ఈసారి పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి నెలలోనే నిర్వహించడానికి ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంబైపీసీ కోర్సును అమలు చేస్తున్నట్లు ఆర్జేడీ తెలిపారు. ఇది ఎంపీసీ, బైపీజీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అలాగే త్వరలో జరిగే అధ్యాపకుల బదిలీలకు సంబంధించిన సమాచారాన్ని పక్కాగా ఉండాలన్నారు. ఏదైనా పొరపాట్లు జరిగితే అందుకు కళాశాలల ప్రిన్సిపాల్స్, జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తప్పుచేస్తే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. అనంతరం టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో జిల్లాలో టాపర్, తల్లిదండ్రులను కడప ఆర్జేడీ, జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డీఐఈవో సురేష్‌బాబు, ఆర్ఐవో గురువయ్య శెట్టి, ప్రిన్సిపాళ్లు లాలెప్ప, సుంకన్న పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం:

ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన కర్నూలు బీ.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను ఇంటర్ బోర్డు రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు శాలువ కప్పి సన్మానించారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ఆర్జేడీ ప్రత్యేకంగా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను అభినందించారు.

నేడు పదో తరగతి విద్యార్థులకు సత్కారం

● డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ఘనంగా సత్కరించనున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమమార్కులు సాధించిన విద్యార్థులతోపాటు వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల హెచ్ఎంలను సత్కరించనున్నారు.

100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు

ఆళ్లగడ్డ బాలికల ఏపీఆర్‌పీఆర్‌పీ పాఠశాల, బాలికల బీసీ వెల్ఫేర్ పాఠశాల, దొర్నిపాడు మండలం అమ్మిరెడ్డినగర్ కేజీబీవీ, కొత్తపల్లె జడ్పీ హైస్కూల్, కొత్తపల్లె మండలం గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాల, పాములపాడు ఏపీ మోడల్ స్కూల్, పాణ్యం మండలం నెరవాడ బీసీ వెల్ఫేర్ స్కూల్, రుద్రవరం కేజీబీవీ, శ్రీశైలం బీసీ వెల్ఫేర్ స్కూల్.

సత్కారం పొందనున్న బీసీ వెల్ఫేర్‌లో పాఠశాలల్లో

శ్రీశైలం పింజరి రంజన్ - 592, నెరవాడ బాలహారిక - 589, శ్రీశైలం డ్యామ్ ఈస్ట్ ఆవుల వేదసాయి కృష్ణ - 588, నెరవాడ బాలికలపాఠశాల జయమాధవీబాయి - 588, గడివేముల బీసీ హాస్టల్ స్వామినాథ్ - 579

● ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉన్నత పాఠశాలల్లో
కోవెలకుంట్ల చిలుకూరి హుశ్శేన్‌బాషా - 589, ఆళ్లగడ్డ సయ్యద్ మహ్మద్ ఆలీ అబ్బాస్ - 575, ఆళ్లగడ్డ షేక్ షహనాజ్ - 574

● **ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో:** పాణ్యం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో వరుసగా శ్రీరామ ఇందు - 570, కురువ రజిత - 558, కొండా ఇంద్రాణి -553,

● **కేజీబీవీల్లో:** సంజామల ఆలమూరి వర్షిణి - 579, రుద్రవరం లింగందిన్నె ధరణి - 575, గోస్పాడు బొగ్గు కార్తీక్-571,

● **మున్సిపల్ పాఠశాలల్లో :** నూనెపల్లె మున్సిపల్ స్కూల్‌లో వరుసగా రాధిక-586, తొగట మణిశంకర్-579, దివ్యశ్రీ - 578

● **ఏపీ మోడల్ స్కూల్స్‌లో:** పాములపాడు మోడల్‌స్కూల్‌లో వరుసగా పదిరే మల్లన్న - 593, జయయశస్విని - 591, గడివేముల హైమావతి -589

● **సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో:** ఆళ్లగడ్డ బాలికల రెసిడెన్షియ్ స్కూల్‌లో వరుసగా మానికింది కీర్తన - 590, వర్షిత - 585, గడ్డం కావ్యసుధ -578.

● **ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో:** శ్రీశైలం డ్యామ్ వెల్ఫేర్ పాఠశాలలో వరుసగా రేవంత్‌నాయక్-590, ఈశ్వర్‌నాయక్ - 584, శ్రీనివాసులనాయక్ - 579.

● **జడ్పీ ఉన్నత పాఠశాలల్లో:** యల్లావత్తుల జడ్పీలో సాధునాగేంద్రబాబు - 592, బండిఆత్మకూరు జడ్పీ పాఠశాలలో నీలకంఠంసుమంత్ - 591, డోన్ బాలికల జడ్పీలో బోయ విజయలక్ష్మి - 590.

● **ఎయిడెడ్ పాఠశాలల్లో :** సెయింట్ జోసఫ్స్ బాలికల పాఠశాలలో వరుసగా ముల్లాఆస్మాపర్వీన్ - 580, లోహిత - 567, పఠాన్ అక్షిన్ వాసిఫా - 566

ముచ్చటగా మూడుసార్లు..

- శంకుస్థాపనలకే పరిమితం
- ప్రారంభం కాని కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

కర్నూలు న్యూసిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలో 17వ వార్డు ఎ.క్యాంపులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ముచ్చటగా మూడు సార్లు శంకుస్థాపనలు చేశారు. 2018 సెప్టెంబరు 23వ తేదీన రూ.49.90 లక్షలతో అప్పటి రెవెన్యూ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి, 2024 మార్చి 6న రూ.70 లక్షలతో అప్పటి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఈ ఏడాది రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ 2024 జూలై 13న రూ.70లక్షలతో ఇదే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపనలకే కమ్యూనిటీ హాల్ నిర్మాణం పరిమితమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఇప్పటి వరకు టెండర్లు కూడా పిలవకుండా నిర్మాణం చేపట్టకపోవడం చాలా దారుణమని


ముగ్గురు ప్రజాప్రతినిధులు చేసిన శంకుస్థాపన శిలాఫలకాలు (ఫైల్)


కమ్యూనిటీ హాల్ నిర్మించాల్సిన స్థలం ఇదే..

స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● పెరిగిన జనాభా...

ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల పరిసర ప్రాంతంలో గతంలో కంటే జనాభా అధిక సంఖ్యలో పెరిగింది. జనాభా తగ్గట్టుగా కాలనీ లో కనీస వసతులు కరువయ్యాయి. ఏదైనా చిన్న శుభకార్యం చేసుకుందామంటే కమ్యూనిటీ హాల్ లేకపోవడం దుర్మార్గమైన చర్య అని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే నిధులు విడుదల చేసిన కూడా నిర్మాణం చేపట్టకపోవడంపై పలు విమర్శలు తావిస్తోంది. ఈ విషయంపై పలు మార్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా బహిరంగ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టకూడదని చెప్పడం విడ్డూరంగా ఉంది. గతంలో ఇదే వార్డులో కమ్యూ నిటీ హాల్ నిర్మాణం చేపడితే అందులో మెప్మా కార్యాలయంతో పాటు కుడా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

● ఎ. క్యాంపు వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు..

గతంలో ఎ.క్యాంపులో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లో అసోసి యేషన్ ఆధ్వర్యంలో యోగా, కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తుండేవారు. అయితే ముందుగా కమ్యూనిటీ హాల్‌ను మెప్మా కార్యాలయానికి కేటాయించారు. అనంతరం కొన్ని సంవత్సరాల తరువాత కుడా కార్యాలయానికి కేటాయించారు. దీంతో అప్పటి నుంచి ఈ కాలనీలో కమ్యూనిటీ హాల్ లేక వృద్ధులు, క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత కార్పొరేటర్ క్రైప పద్మలతా రెడ్డి ఎలాగైనా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని మంత్రి టీజీ భరత్‌ను విజ్ఞప్తి చేశారు. దీంతో గత సంవత్సరం జూలైలో మంత్రి టీజీ భరత్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. అయితే అధికారులు మాత్రమే నిర్మాణం చేపట్టడానికి ముందుకు రావడం లేదు.

చిన్న శుభకార్యాలు చేసుకునేందుకు..

వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కాలనీలో చిన్న చిన్న శుభకార్యాలు చేసుకునేందుకు ఎలాంటి హాల్స్ లేవు. నిధులున్నా కూడా ఎందుకు వినియోగిం చుకోలేకపోతున్నారు. తక్షణమే కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి.

– అనూరాధ, విశ్రాంత ఈవోఆర్‌డీ, పంచాయతీరాజ్ శాఖ

మంత్రి టీజీ భరత్ చొరవ చూపాలి

కాలనీలో వృద్ధులు సేదతీరేందుకు అవకాశం లేకుండా చేశారు. గతంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఉదయం, సాయంత్రం సమయాల్లో వృద్ధులు కాసేపు సేద తీరేవారు. అయితే ప్రస్తుతం పార్కులు కూడా సరిగ్గా లేవు. మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకుని కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి.

– సుబ్బారెడ్డి, మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్పలు పిలుపునిచ్చారు. శుక్రవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావే శంలో వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా కార్మిక చట్టాలన్నింటిని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించారన్నారు. బీజేపీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 20న జరిగే సమ్మె ద్వారా లేబర్ కోడ్లు రద్దు అయ్యే విధంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రాజు, సురేష్ నాయక్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీఐ టీయూ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సాయిబాబా, విజయ్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణపై అభిప్రాయాలు తెలపండి: కమిషనర్


ప్రజల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): నగరలోని అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రజలు అభిప్రాయాలు తెలపాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు కోరారు. శుక్రవారం పరిమళనగర్‌లోని అన్న క్యాంటీ న్‌ను ఆయన పరిశీలించారు. ఆహార రుచి, శుభ్రత గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అన్న క్యాంటీన్ వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపవచ్చని సూచించారు. వాటి ఆధారంగా అన్న క్యాంటీన్‌లను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 54వ రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు మార్కాపురంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వహక సెక్రటరీ గణేష్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏపీ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. మార్కాపురంలోని సుజాత ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ప్లేగ్రౌండులో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, మే 2(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. శుక్రవారం నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద ఉన్న లక్ష్మివెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో కరాటే సీనియర్ శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి తైక్వాండో శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో చిన్నారులు ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడ సాధన చేయాలని, వేసవి శిక్షణా శిబిరాలను సద్వి్ని యోగం చేసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలు చేస్తే జైలుకే


కిశోర బాలికలకు సూచనలిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

సి.బెళగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేస్తే జైలు శిక్ష తప్పదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లేశ్వరమ్మ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో కిశోర బాలికల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆమె వారితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాలికల తల్లిదండ్రులు అధికంగా బాల్యవివాహాలు చేసి వారి జీవితా లను నాశనం చేస్తున్నారన్నారు. అలాగే కిశోర బాలికలకు, బాలింత లకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు, పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డీ అడిక్షన్‌పై శిక్షణ

కర్నూలు హాస్పిటల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ డీ అడిక్షన్‌పై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు రోజులపాటు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో నగరంలోని బిర్లా కాంపౌండులోని కృష్ణకాంత్ ప్లాజాలో డా.బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

రమణీయం.. సాయిబాబా రథోత్సవం


రథోత్సవానికి హాజరైన భక్తులు

కోడుమూరు రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి గ్రామంలో సద్గురు సాయిబాబా రథోత్సవం శుక్రవారం సాయంత్రం రమణీయంగా సాగింది. ఉదయం ఆలయంలో అభిషేకాలు, హారతి పూజలు నిర్వహించారు. సాయంత్రం పూలమాలలతో అలంకరించిన రథంపై సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి వేదపండితులు కొండమడుగు శివసుబ్రమణ్యశర్మ, నరసింహశర్మ అధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రథానికి గుమ్మడి, టెంకాయలు కొట్టి సాత్విక బలిదానం సమర్పించారు. అనంతరం భక్తులు సాయి నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. రథోత్సవంలో గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున పాల్గొన్నారు. నిర్వాహకులు స్థానిక జడ్పీ పాఠశాల మైదానంలో కబడ్డీ పోటీలు ప్రారంభించారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామికి పూజలు


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో శ్రీదేవి భూదేవి సహిత లక్ష్మీవేంకటేశ్వరస్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డికి నాయకులు, కార్యకర్తలు మేళతాళాలతో ఘనంగా స్వాగ తం పలికారు. స్వామి, అమ్మవార్లను ప్రభోత్సవంపై ఊరేగించారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు భారీగా తరలివచ్చి స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించారు. ప్రధాన అర్చకులు జంద్యాల శశిధర శర్మ స్వామివారికి పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో ధర్మకర్తలు పల్లె నాగేశ్వరరెడ్డి, సుధాకర్, విజయుడు, రామ సుబ్బయ్య, బత్తుల నరేంద్ర, మహేశ్వరి, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, గ్రామ నాయకులు రమణారెడ్డి, కృష్ణయ్య చౌదరి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జయలక్ష్మి మాత జయంతి

కల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ శుద్ధ పంచమిని పురస్కరించుకుని శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ మాతృమూర్తి యోగా గురువు జయ లక్ష్మి మాత జయంతిని ఘనంగా జరిగాయి. శుక్రవారం ఆలయంలో ఉదయం రాహుకాల, దుర్గాపూజ, శ్రీలలితా సహస్రనామ పారాయణంతోపాటు జయలక్ష్మీ మాత పాదుకలకు పంచామృతాభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించారు. భక్తులు వడిబియ్యం సమర్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ టి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో సీఏ భరత్‌వర్మ దంపతుల సహకారంతో అన్నదాన వితరణ చేశారు. శ్రీదేవి, సీఏ రాజేశ్వరి, డాక్టర్ నాగజ్యోతి పాల్గొన్నారు.

● ముజఫర్‌నగర్‌లోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో రామా యణ ప్రవచనాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త చిలుకూరి ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆలయంలో ఇంటాక్ లైఫ్ మెంబర్ డాక్టర్ గుంటూరు సుబ్బరామయ్య రామాయణ ప్రవచనాలు బోధిస్తారని ఆయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బాలయ్య, శ్రీరాములు, భాస్కర్, అంబాజీరావు, గౌరమ్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

'వర్గీకరణ ఫలితాలు 57 ఉప కులాలకు అందాలి'

కర్నూలు న్యూసిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలితాలు 57 ఉపకులాలకు అందాలని ఎస్సీ 57 ఉపకులాలకు హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బైరీ వెంకటేశం కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమితి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాల మాదిగలకు కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ ఒకటి రెండ్రోజుల్లో ఇస్తుంటే, మిగిలిన 57 ఉప కులాల వారికి కలెక్టర్, ఆర్డీవో ఇస్తుండటంతో ఆరు నెలల నుంచి సంవత్సరం సమయం పడుతోందన్నారు. శివయ్య, వెంకటన్న, బుజ్జి, మౌలాలి, మోచి లోకేశ్, బుడ్డన్న పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో వేధిస్తున్న సమస్యలు

- 28వ వార్డు పందిపాడులో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- ఐదేళ్లవుతున్నా అభివృద్ధి అంతంతే
- ఇళ్ల ఎదుట నిలుస్తున్న మురుగు

కల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో సమస్యలు వేధిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం కల్లూరు మండలంలోని పందిపాడు, లక్ష్మీపురం, పెద్దపాడు, దూపాడు గ్రామాలను హడావిడిగా కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఇప్పటికీ పందిపాడు గ్రామ ప్రజలకు హంద్రీనదిలో బావుల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. పంచాయతీగా ఉన్నపుడు చేపట్టిన పనులు తప్ప కొత్తగా మౌలిక వసతులు కల్పించలేదు. నగర శివారు కాలనీల్లో జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో కార్పొరేషన్ అధికారులు విఫలం అయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. పందిపాడు కాలనీల్లో పక్కా రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పైపులైన్ల ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● బీఆర్ రెడ్డి కాలనీలో ఇళ్ల ముందు నిలుస్తున్న మురుగు: 28వ వార్డు పరిధిలోని బీఆర్.రెడ్డి కాలనీలో డ్రైనేజీలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. మురుగు నీరు వెళ్లడానికి కాల్వలు లేక ఇళ్ల ముందు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందడంతో పాటు విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ సమస్యపై కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌కు


బీఆర్ రెడ్డి కాలనీలో ఇళ్ల ముందు నిలిచిన మురుగు

పన్నులు చెల్లిస్తున్నా మా కాలనీల్లో మౌలిక వసతులు ఎందుకు విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

డ్రైనేజీలు నిర్మించాలి

బీఆర్‌రెడ్డి కాలనీలో నెలలుగా డ్రైనేజీ సమస్య ఉంది. పంచాయతీలో ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ ధ్వంసమైంది. కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరు ఇళ్లమధ్యనే నిలుస్తోంది. కాలనీ వాసులు దుర్వాసన భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలి.

– శ్రీనివాసులు, సీపీఎం నాయకుడు

ఈ-శ్రమ్ కార్డు తీసుకోండి: ఎంపీడీవో

కోడుమూరు రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఈశ్రమ్ కార్డు తీసుకోవాలని ఎంపీడీవో రాముడు తెలిపారు. శుక్రవారం క్రిష్టాపురం రహదారిలో కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి శ్రామికులకు ఈశ్రమ్ కార్డు ఆవశ్యకతపై వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు, కూలీలంతా ఆధార్‌కార్డు వెంట తీసుకుని మీసేవా, సచివాలయం లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఈశ్రమ్ కార్డు పొందవచ్చని అన్నారు. ప్రమావశాత్తు మరణం, శాశ్వత వైక ల్యం అయితే రూ. 2లక్షలు, పాక్షిక వైకల్యం రూ.లక్ష ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. ఈశ్రమ్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ విధానంపై అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఏపీవో మోదీన్‌బాష, టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తం పాల్గొన్నారు.

ఉద్యోగి ఆత్మహత్యాయత్నంపై విచారించాలి


మహేష్‌ను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ హెల్త్ ఇన్స్‌పెక్టర్ పెట్టే వేధింపులు తట్టుకోలేక పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ ఉద్యోగి మహేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని, దీనిపై కర్నూలు జీజీహెచ్ అధికారులు నిజనిర్ధారణ కమిటీ వేసి విచారించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. కర్నూలు ప్రభుత్వ అసుపత్రి ట్రామకేర్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ ఉద్యోగి మహేష్‌ను సీఐటీయూ నగర ఆఫీస్ బేరర్స్ రామకృష్ణ, మైమూద్‌లతో కలిసి ఆయన పరామర్శించారు. పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ అయిన సాయి గ్రూప్ ప్రతి నెల ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, దీంతో ఉద్యోగులు కుటుంబ పోషణ కోసం డ్యూటీలేని సమయంలో ఇతర పనులు చేసుకుంటున్నారని అన్నారు. సాయి గ్రూప్ ఏజెన్సీ మెడికల్ కాలేజీలో తక్కువ అమౌంటుకు టెండర్ వేసుకోవడం వల్ల ఏ కార్మికుడు కూడా వీక్లి ఆఫ్ తీసుకోలేకపోతున్నారని, హక్కులు గురించి అడిగితే డ్యూటీ నుంచి తీసివేస్తామంటున్నారని బెదిరిస్తున్నారని అన్నారు. పెస్ట్ కంట్రోల్ ఉద్యోగి మహేష్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కర్నూలు హాస్పిటల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో గార్గేయపురం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను టీకాలు ఉంచు గదులను లేబర్ రూం, ల్యాబ్‌ను డీఎంహెచ్‌వో పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట డెమో శ్రీనివాసులు శెట్టి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, స్టాఫ్ నర్సు నిర్మలరాణి పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

కర్నూలు అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు చేసింది. శుక్రవారం సాయంత్రం ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో కల్లూరు మండలం ఓబులాపురం తండలో 1600 లీటర్ల ఊట, 30 లీటర్ల నాటు సారా ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ మాట్లాడుతూ నాటు సారా తయారు చేసిన, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది రామ లింగయ్య, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగద్గురువుల జయంతి


జగద్గురువులకు పూజలు చేస్తున్న పీఠాధిపతి, భక్తులు

కర్నూలు కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): జగద్గురువులు ఆదిశంకరాచార్య రామానుజాచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం పాత నగరంలోని జమ్మిచెట్టు సమీపంలో గల లలితా పీఠంలో ఘనంగా నిర్వహించారు. జగద్గురువుల చిత్రపటాలకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతి గురు సుబ్రహ్మణ్యం స్వామి మాట్లాడుతూ భగవంతుడి ముందు అందరూ సమానమేనని సమాజంలో సమతా మమత అను మానవతా ధర్మాని వైష్ణవ సంప్రదాయాన్ని విస్తృత పరిచిన అవతార పురుషుడు రామానుజుల వారని భక్తులకు తెలియజేశారు.

● నగరంలోని సంకల్‌బాగ్ సమీపంలో వెలసిన హరిహర క్షేత్రంలో శుక్రవారం జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి, బ్రాహ్మణ బాలురకు ధర్మోపనయనాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జగదుర్గువు ఆది శంకరాచార్యులు వారి విగ్రహానికి పంచామృతాభిషేకాలు విశేష పూజలను చేపట్టారు. అనంతరం ధర్మోప నయనాలకు పేర్లు నమోదు చేసుకున్న బాలలకు టీటీడీ వేద పండితులు కమల సాయినాథ శర్మ, పురోహిత శ్రేష్ఠ కోదండ రామశర్మ బృందం శాస్త్రోక్తంగా ఋగ్వేదం యజుర్వేదం, ఉపనయన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో కళ్లె వేణుగోపాల శర్మ, విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ కేవీ సుబ్బారావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజు శర్మ, ఉపాధ్యక్షులు కంచుగంటల శ్యాంసుందర్ శర్మ, గౌరవా సలహాదారుడు టీవీ రవిచంద్ర శర్మ, కృష్ణజ్యోతి శ్రీనివాసరాజు, ఆనందరావు, రాధాకృష్ణ, శివన్న, ప్రధాన అర్చకుడు ప్రసన్నస్వామి, మహేష్, గురు రాజారావు, జయలక్ష్మి, సీతాలక్ష్మి, భార్గవి, గాయత్రీ, హిమబిందు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా బస్టాండు


సి.బెళగల్ బస్టాండులో నిలిచిన వాహనాలు

సి.బెళగల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్ బస్టాండు ప్రమాదా లకు నిలయంగా మారింది. బస్టాండు అవరణలో ప్రయాణికులు కూర్చోవడానికి నిలబడానికి కూడా స్థలం లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు ఎదురుగా వస్తే పాదచారులు పోవడానికి కూడా దారి ఉండదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండు అవరణలో ఉన్న బంకు లను తొలగించాలని గ్రామస్థులు పలుమార్లు మండల అధికారులకు తెలిపినా పట్టించు కోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన



హలహర్విలో నిర్వహిస్తున్న కిశోర బాలికల సదస్సు

హలహర్వి, మే2(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు ఆరోగ్యపరంగా, విద్యాపరంగా, సమాజంపట్ల అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి మన్సూర్‌వలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చందన అన్నారు. శుక్రవారం హలహర్విలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిరక్ష్యరాస్యత వల్ల మూఢాచారాలు, బాల్యవివాహాలతో పిల్లల జీవితాలు అంధకారంగా మారుతున్నాయన్నారు. ప్రతి ఇంట ఆడపిల్లలు ఉన్నత విద్యనభ్యసిస్తే వారిని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చవచ్చన్నారు. సమాజంలో వారికి స్వేచ్ఛ, భద్రత వంటివి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఐసీడీఎస్, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్థానిక సచివాలయం-1లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సరస్వతి మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల వయస్సు బాలికలకు ఎంపికచేసిన అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 10వ తేదీ వరకు కిశోర వికాసం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సువాసిని, అన్నమ్మ, రంగవేణి, హాసిని, ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు అందజేస్తాం: ఏపీవో



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో చక్రవర్తి

హలహర్వి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు త్వరలో వారి ఖాతాల్లో జమ చేస్తామని ఏపీవో చక్రవర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని బాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీలకు బీమాతో భరోసా కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ రూ.20 చెల్లించి బీమా పొందాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, కూలీలంతా జాగ్రత్తలు పాటించి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలని సూచించారు. వేతనాలకు ఎటువంటి సమస్య లేదని, ప్రతి కుటుంబం ఉపాధి పనులకు హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి



ఎంవీఐ శిశిర దీప్తికి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఢణాపురం ఉదయ్ కోరారు. శుక్రవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) శిశిరదీప్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఢణాపురం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పోలీసులతో మాట్లాడి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

న్యాయాధికారి బాధ్యతల స్వీకరణ



న్యాయాధికారి పుష్పగుచ్ఛం ఇస్తున్న బార్ అధ్యక్షుడు

పత్తికొండ, మే2(ఆంధ్రజ్యోతి): పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా జ్యోత్స్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు, సభ్యులు న్యాయాధికారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. పూలబొకేతో ఆమెకు స్వాగతం పలికారు. కేసుల పరిష్కారంలో న్యాయవాదులు తమ వంతు సహాయసహకాలు అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సినియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవు

పత్తికొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాల్లో నాటుసారా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ సీఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పత్తికొండ మండలం పెండ్లిమానుతండాలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 500 లీటర్ల బెలం ఊటను ధ్వంసం చేసి, 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది సర్దార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్

పత్తికొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలు ఇంటి స్థలాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం తన చాంబరులో ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పట్టణంలో ఉన్న నిరుద్యోగులు సొంతింటి స్థలం లేని నిరుపేదలు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలను కేటాయించడం జరుగుతుందన్నారు.

నామినేటెడ్ పదవులపై
కూటమి నాయకుల్లో ఆశలు

- ఒక్కో పోస్టుకు ముగ్గురు పేర్ల పరిశీలన
- ఏడు సొసైటీలు, మార్కెట్ యార్డుపై గురి
- మూడో విడత జాబితాలోనూ మార్కెట్ చైర్మన్‌ను ప్రకటించని అధిష్ఠానం

ఆలూరు, మే2(ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఈ యేడాది జనవరిలో వీటిని భర్తీ చేయాలని పార్టీ అధిష్ఠానం అనుకున్నా ఏప్రిల్ నాటికి భర్తీ చేస్తామని అధిష్ఠానం ప్రకటించారు. జాబితాలు సిద్ధం చేసి స్థానిక నేతలు అధినాయకులకు సమర్పించారు. మరోవైపు నాయకులు బయోడేటాలను తీసుకుని పార్టీ అధిష్ఠానం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో అధిష్ఠానం ఎప్పుడు ఆమోదముద్ర వేస్తుందోనని స్థానిక నేతలు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో ఏడు సొసైటీల అధ్యక్ష పదవులు ఉండగా ఒక్క మార్కెట్‌యార్డు చైర్మన్‌తో పాటు ఆలయ కమిటీ పదవులు ఉన్నాయి.



నాయకుల ఎదురుచూపులు

సొసైటీ అధ్యక్షుల పేర్లను ప్రతిపాదిస్తూ జాబితాలను కూడా సిద్ధం చేశారు. గతంలో ఎమ్మెల్సీ కోడ్ రావడంతో వీటి భర్తీ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికలు ముగిశాయి. ఇటు పార్టీ అధినాయకులు కూడా ఈ నెలాఖరులోపు అన్ని కమిటీలను భర్తీ చేస్తామని చెప్పడంతో కూటమి నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే పర్సన్ ఇన్‌చార్జిలను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తుర్వులు జారీ చేసింది. జాబితా ప్రకారం తమకు దక్కుతుందా? లేదా చివరి క్షణంలో ఏమైనా మార్పులు, చేర్పులు జరిగి తమను తప్పిస్తారా? అన్న టెన్షన్ కూడా కొందరిలో నెలకొంది. దీంతో నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి పైనే అందరి దృష్టి పడింది. ఎస్సీ సామాజికవర్గానికి రిజర్వు కావడంతో ఇప్పటికే ఆ పదవి కోసం ఆరు మందికిపైగా ఆశావహులు సిద్ధమయ్యారు. మరోవైపు జనసేన, బీజేపీ నేతలు కూడా పదవుల కోసం పోటీ పడుతున్నారు. రాష్ట్ర టీడీపీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీలో వర్గాలు ఉండడంతో అభ్యర్థుల ఎంపిక క్లిష్టతరంగా మారింది. ఇంకా ప్రధాన ఆలయాలు కూడా ఉండడంతో నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో జరిగే నామినేటెడ్ పదవులు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో భర్తీ చేయాల్సి ఉన్నందున ఈ పదవులను ఎవరికి కట్టబెట్టాలో కష్టతరంగా మారనుంది. మరోవైపు శ్రీశైలం దేవస్థానం పదవుల కోసం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత నారాయణరెడ్డి, శివప్రకాష్ కూడా పోటీ పడుతున్నారు. ఇందుకోసం జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, పార్టీ అధ్యక్షుడి లెటర్ హెడ్‌లు తీసుకున్నారు. మరి టీడీపీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేస్తుందో అన్న ఉత్కంఠతో ఉన్నారు.

వర్గాలతో రెండోసారి జాబితాలో ఖరారు కాని మార్కెట్ కమిటీ చైర్మన్

టీడీపీలో ఉన్న వర్గాల కారణంగా టీడీపీ అధిష్ఠానం ప్రకటించిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ల మూడో జాబితాలో కూడా ఆలూరు లేకపోవడంతో ఆశావహులు నిరుత్సాహానికి గురయ్యారు. మరోవైపు ఈ పదవికి రెండు వర్గాల నుంచి ఆరుగురికి పైగా పోటీ పడుతున్నారు. ఇందుకు ఆలూరుకు చెందిన పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు సోదరుడు త్యాగరాజుకు ఇప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే సీనియర్ నాయకులు చిన్నహ్యాట శేషగిరి, బిల్లేకల్ వెంకటేష్, ఆలూరుకు చెందిన కొమ్ము రాజు, ఆస్పరి కి చెందిన సంజన్న సోదరులు ఆశిస్తున్నారు. దీంతో అధిష్ఠానానికి చైర్మన్ ఎన్నిక కష్టతరంగా మారనుంది.

'కగార్ ఆపరేషన్'ను ఉపసంహరించుకోవాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఆదోని అభివృద్ధి వేదిక కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆపరేషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతో మోడీ ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ నెత్తుటి మడుగుగా మారుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బూటకపు ఎన్ కౌంటర్ దాటి ఆదివాసులను నగ్నంగా ఊచకోత కోస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర సరిహద్దులోని విశాలమైన కర్రెగుట్టల ప్రాంతాన్ని కేంద్రప్రభుత్వ సాయుధ బలగాలు చుట్టముట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆదివాసులకు అండగా నిలబడ్డ మావోయిస్టుల ఏరువేత పేరిట సాగిస్తున్న ఫ్యాక్షనిస్టు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి యంకప్ప, పిఒడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మనీ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అఖండ, కుమార్, నారాయణ, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ పంటలపై రైతులకు అవగాహన

పత్తికొండ, మే2(ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ పంటలసాగుపై రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. పంటలసాగుకు ఉపాధి పనుల అనుసంధానం గురించి వివరించారు. ఆసక్తి ఉన్న రైతుల ఈపథకం ద్వారా పనుల కోసం దరఖాస్తు ఎలా చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో జేఈ జిలాని, టీఏ సుధాకర్, ఎఫ్ఏ గోపాలక్రిష్ణ, మేటీలు పాల్గొన్నారు.

అద్దె పెంచకపోవడంతో బ్యాంకుకు తాళం



అద్దె పెంచకపోవడంతో బ్యాంకుకు తాళం వేసిన యజమాని

దేవనకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): అద్దె పెంచకపోవడంతో ఇంటి యజమాని బ్యాంక్‌కు తాళం వేసిన ఘటన మండలంలోని తెర్నేకల్‌లో చోటు చేసుకొంది. గ్రామంలో ప్రధాన రహదారిపై ఆదోని తిమ్మప్ప అనే వ్యక్తి తన భవనాన్ని ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్‌కు గత ఇరవై ఏళ్ల క్రితం అద్దెకు ఇచ్చాడు. ప్రస్తుతం రూ.6 వేలు అద్దె చెలిస్తుండగా, పెరిగిన ధరలకు అనుగుణంగా అద్దె పెంచాలని మేనేజరు శేషాద్రిరెడ్డిని భవన యజమాని గత ఏడాది మొరపెట్టుకుంటున్న పట్టించుకోకపోవడంతో, శుక్రవారం బ్యాంకు ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన చేశాడు. చివరకు బ్యాంకు అధికారులు చోరవ తీసుకొని యజమానితో మాట్లాడి తాళం తీసి, యాధావిధిగా బ్యాంకు సేవలు కోనసాగించారు..

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తుగ్గలి, మే 2 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండకుండా యువతీ యువకులకు వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరూ శిక్షార్హులు అవుతారని పగిడిరాయి వైద్యులు హరిత, పత్తికొండ సీడీపీవో లలిత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జొన్నగిరి, గిరిగిట్ల తదితర గ్రామాల్లో యుక్త వయస్సు పిల్లలకు సమాజంలో, శరీరంలో జరిగే మార్పులపైన, వారికి అవగాహన కల్పించడంతో పాటు వారికి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఏమైనా సమస్యలున్నా వెంటనే వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మహిళా చట్టాలను గౌరవించాలని చెప్పుకొచ్చారు. యుక్త వయస్సులో వచ్చే ప్రెగ్నెన్సీల వల్ల ఎన్నో నష్టాలు జరుగుతాయని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంబికా, త్రివేణి, అంగన్‌వాడీ టీచర్లు సిద్దమ్మ, అనుసూయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

పత్తికొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో లక్ష్మీవేంకటేశ్వర కల్యాణం, రథోత్సవ వేడుకలు శుక్రవారం రమణీయంగా, ఘనంగా జరిగాయి. స్థానిక బ్రాహ్మణ వీధిలో వెలసిన పురాతన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ అమరావతి శివరామకృష్ణయ్య సారథ్యంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్థానిక గుత్తి సర్కిల్ నుంచి ఊరు వాకిలి ప్రాంతం వరకు శ్రీవారి రథోత్సవ వేడుకలు అశేష భక్తజనవాహిని మధ్య ఘనంగా జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, బీటీ గోవిందు, సోమ్లా నాయక్, చక్క గోపాల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సుమంత్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

అమరావతి పునఃప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



అమరావతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, మే2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభోత్సవంలో శుక్రవారం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొన్నారు. పత్తికొండ నియోజకవర్గం నుంచి ఐదు బస్సులలో నాయకులు, కార్యకర్తలు అమరావతికి బయలుదేరి వెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అమరావతి రాజధాని ప్రారంభోత్సవంలో తనతండ్రి కేఈ క్రిష్ణమూర్తి డిప్యూటీ సీఎం హోదాలో పాలుపంచుకున్నారని, పునఃప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే హోదాలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

తుగ్గలి: అమరావతి పునఃనిర్మాణ కోసం శంకుస్థాపన వేడుకలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ వరలక్ష్మీతో పాటు మండల టీడీపీ నాయకులు, ప్రజలు తరలివెళ్లారు. శుక్రవారం అమరావతిలో జరిగిన వేడుకల్లో వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి క్షుణ్ణంగా వివరించారని, కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోవు రోజుల్లో అమరావతి దేశంలోనే అతి పెద్ద రాజధాని నగరంగా ఎదుగుతుందన్నారు. వేడుకల్లో పాల్గొనడం ఎంతో అదృష్టమని చెప్పుకొచ్చారు.

వెల్దుర్తి పంచాయతీ కార్యదర్శిగా గురుస్వామి

వెల్దుర్తి, మే 2(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీగా గురుస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గోవర్ధనగిరి రెగ్యులర్ కార్యదర్శి, అయితే ఇన్‌చార్జీగా వెల్దుర్తిలో విధులు నిర్వహిస్తారు. నూతన పంచాయతీ సెక్రటరీ గురుస్వామి మాట్లాడుతూ గ్రామపెద్దలు, ప్రజల సహకారంతో వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఆస్తిపన్ను, కొళాయిపన్ను, ట్రేడ్ లైసెన్సులు చెల్లించాలన్నారు. ఇంతకుమునుపు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనాథ్ బదిలీపై నంద్యాల జిల్లా డోన్ మండలం దొరపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీగా వెళ్లారు.

వైద్యశాల నిర్మాణ పనులకు భూమిపూజ

దేవనకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్‌లో 30 పడకల ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నిర్మాణ పనులకు నాయకులు, అధికారులు భూమి పూజ చేశారు. జడ్పీ పాఠశాల సమీపంలో రూ.2 కోట్లతో నిర్మించే వైద్యశాలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ వెంకప్ప, ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్రకుమార్, ఆదోని డీఈ దండు వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆరుణజ్యోతి, వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఏఈ శ్వేత, నాయకులు బాటమీది వెంకప్ప, నాగేష్, ఉచ్చీరప్ప, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వడ్డె తిమ్మప్ప పది రోజుల క్రితం మృతి చెందడంతో, స్థానిక టీడీపీ నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. తిమ్మప్ప మృతి పార్టీకి తీరనిలోటని నాయకులు చిన్న వెంకప్ప, కోలంట్ల తిమ్మప్ప అన్నారు. కుమారుడి మృతిని తట్టుకొలేక తిమ్మప్ప తల్లి కుడా ఐదు రోజుల వ్యవధిలోని మృతి చెందడం కలచివేసిందన్నారు. వడ్డే పులికొండ, రాజు, కిష్టన్న, తదితరులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చాయి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

మద్దికెర, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు కూటమి ప్రభుత్వం విద్యను బలోపేతం చేయడంలో భాగంగా తరగతుల ప్రారంభానికి నెల రోజుల ముందే మద్దికెర మండలానికి పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు ఎంఈవో రంగస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 27 పాఠశాలలకు గానూ ప్రతి ఏడాది విద్యాసంవత్సరం 18వేలకు పుస్తకాలు రావాల్సి ఉండగా.. మొదటి విడతలో 9,525 పుస్తకాలు వచ్చాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలను కొన్ని పాఠశాలలకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలతో పాటు త్వరలో విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్‌లు, షూస్ వస్తాయన్నారు. పాఠశాల పునఃప్రారంభించిన రోజే విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

వెల్దుర్తి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలో గోవర్ధనగిరి గ్రామంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కేంద్రాన్ని నోడల్ అధికారి రఘు శుక్రవారం పరిశీలించారు. నోడల్ అధికారి రఘు మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరిగినందున ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్ రెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకులు

మద్దికెర, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థికంగా సామాజికంగా వెనకబడిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ వలసల రామకృష్ణ, పశువులు శ్రీరాములు, క్రాంతి నాయుడు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జిల్లాలో వాల్మీకి జనాభా ఎంతో ఉందని వాల్మీకులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకులు ఉపేంద్ర, చిరంజీవి, శేఖర్, రంగస్వామి, రంగన్న, సురేష్, సుంకన్న ఉన్నారు.

తుగ్గలి: వాల్మీకులను అధికారికంగా ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ గుంతా దేవి, రఘు, పసుల శ్రీరాములు అన్నారు శుక్రవారం జొన్నగిరిలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని చెబుతున్నారే తప్ప ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించలేదన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి వెనుకబడిన వారిని అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

మద్దికెర, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం వాల్మీకి విగ్రహం ముందు గ్రామ పెద్దలు, ప్రజలు ఆధ్వర్యంలో హోమాలు చేశారు. అనంతరం పురోహితుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన గుంతా హనుమన్న సుంకమ్మ దంపతులు కుమారుడైన నాగరాజు, అశోక్‌లో విగ్రహానికి అయ్యే ఖర్చు రూ. 2లక్షలు, ఆలయానికి గ్రామపెద్దలు విరాళాలు అందజేశారు.

రూ.3.96కోట్ల ముందస్తు పన్నుల వసూళ్లు

- మున్సిపల్ రెవెన్యూ అధికారి

ఆదోనిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని ఆస్తి పన్నుల ముందస్తు వసూళ్లు సంతృప్తికరంగా ఉన్నాయని మున్సిపల్ రెవిన్యూ అధికారి నిస్సార్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు పన్నుల చెల్లింపుపై ప్రభుత్వం 5శాతం రిబేటును ప్రకటించడంతో ప్రజలు ఉత్సాహంగా తమ పనులను చెల్లించడానికి ముందుకు వచ్చారన్నారు. ఏప్రిల్ నెల 30వ తేదీతో ప్రభుత్వం ప్రకటించిన 5శాతం రిబేటు అవకాశం ముగిసిందన్నారు. ఏప్రిల్ 1 నుంచి 30వ తేది వరకు ముందస్తు పన్నుల వసూళ్లు రూ.3.96 కోట్లు వసూలు కావడం జరిగిందన్నారు. పన్నుల వసూళ్లపైనే పట్టణాభివృద్ధి ఆధారపడడంతో ప్రజలు సకాలంలో తమ ఆస్తి పన్నులు చెల్లించి సహకరించాలన్నారు. పెండింగ్ బకాయిలు ఉన్నవారికి వడ్డీ అధికం కాకుండా 2025-26 సంవత్సరానికి సంబంధించిన పనులను సకాలంలో చెల్లించాలని సూచించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ ప్రభుత్వం దేశంలో కార్మిక రంగాన్ని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఎస్ బాలరాజు అధ్యక్షతన జరిగిన నిర్వహించిన బైక్ ర్యాలీని జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రారంభించారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సత్యన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి చెన్నకేశవులు, బాబు, మునెప్ప, యువరాజు పాల్గొన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.14కోట్లు



హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది

కౌతాళం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను దేవస్థానపు కాలక్షేపపు మండపంలో శుక్రవారం ఆలయ ఈవో విజయరాజు ఆధ్వర్యంలో లెక్కించారు. నగదు రూపంలో రూ.1,14,68,836లు, బంగారము 29 గ్రాములు, వెండి 12 కిలోలు వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ రెండు నెలలకు సంబంధించినది. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఆదోని గ్రూపు ఆలయ పర్యవేక్షులు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్న స్వామి యూనియన్ బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఫలితాలు విడుదల

పెద్దకడుబూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరులోని మోడల్ స్కూల్‌లో 6వతరగతి ప్రవేశ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రంగన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద సీట్లకు గాను 265 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. అయితే ఈ పరీక్షల్లో 130 మంది అర్హత సాధించారన్నారు. మెరిట్ లిస్టను పాఠశాల ఆవర ణలో నోటీస్ బోర్డులో ఉంచామన్నారు.

మంచాలమ్మకు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం

మంత్రాలయం, మే 2(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. శుక్రవారం వైశాఖ శుద్ధ పంచమి శుభదినాన్ని పురస్కరించుకొని పండితులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు, గంధం, పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఎస్‌సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26వ సంవత్సరానికి సంబంధించిన ఎస్‌సీ కార్పొరేషన్ రుణాలు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్షుద్ర పూజలు కలకలం



జాలవాడిలో ఓ ఇంటి ముందు క్షుద్ర పూజలు

పెద్దకడుబూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాలవాడి గ్రామంలో టీడీపీ నాయకుడు ముక్కన్న ఇంటి ముందు క్షుద్ర పూజలు కలకలంరేపాయి. శుక్రవారం టీడీపీ నాయకుడు మాట్లాడుతూ రెండు రోజుల పాటు అర్ధరాత్రి గుర్తు తెలియన వ్యక్తులు క్షుద్రపూజలు చేశారన్నారు. ఘటన స్థలంలో నిమ్మకాయలు, ఉల్లిగడ్డలు, మెంతాలు, కోడిగుడ్లు వాటిపై కుంకుమ, పసుపు చల్లి, నిమ్మకాయలకు మేకులతో కొట్టి అక్కడే వదిలేయడంతో తమ కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులకు పిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

పూల తోటల సాగుపై దృష్టి సారించాలి



పూలతోటను పరిశీలిస్తున్న ఎంపీడీవో పుల్లయ్య

నందవరం, మే 2(ఆంధ్రజ్యోతి): రైతులు పూలతోటలు, పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలని ఎంపీడీవో పుల్లయ్య సూచించారు. శుక్రవారం నందవరం మండలంలోని పెద్దకొత్తిలి గ్రామంలో రైతులు వేసుకున్న పూల తోటలను పరిశీలించారు. ప్రతి రైతు ఇలా పంట మార్పిడి చేస్తే దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. అలాగే నదికైరవాడి గ్రామంలో మేజర్ కెనాల్ వర్కును విజిట్ చేశారు. కూలీలు కొలతల ప్రకారం పనిచేసి రోజు వేతనం రూ 307 తీసుకునేలా చూడాలని కూలీ లకు తెలిపారు. కూలీలందరు ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన చేసుకోవాలని తెలిపారు. మస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిసెంట్లు, ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం రాజీవ్ గృహకల్ప

- శిథిలావస్థకు చేరిన గృహాలు
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు

ఎమ్మిగనూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని మైనార్టీ కాలనీ సమీపంలో 16ఏళ్ల క్రితం నిర్మించిన రాజీవ్ గృహకల్ప సముదాయం పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురువుతున్నాయి.



పూడికతీతకు నోచుకోని మురుగు కాలువ

దీంతో గృహాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసవసతులు లేకపోవటంతో లబ్ధిదారులు నివాసం ఉండేందుకు అపసోపాలు పడుతున్నారు. 2009లో అప్పటి ప్రభుత్వం పట్టణ శివారులోని మైనార్టీ కాలనీ, షాదీఖాన మధ్యలో రాజీవ్ గృహకల్ప పథకం కింద 48 గృహాలను (అపార్ట్ మెంట్)నిర్మించారు. గృహాల నిర్మాణానికి బ్యాంకులు ఒక్కో గృహానికి రూ.82వేల చొప్పున అందజేశాయి. ఈగృహాలను 2.3.2009న అప్పటి ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతూ కాపురాలు చేస్తున్నారు. కొంతమంది ఈ ఇబ్బందులు పడలేక ఖాళీ చేసి వెళ్లిపోయారు.

● వేధిస్తున్న సమస్యలు

రాజీవ్ గృహకల్ప సముదాయంలో పలు సమస్యలు వేధిస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలో నుంచి గృహసముదాయం వరకు సీసీ రోడ్డుకాని బీటీ రోడ్డు లేకపోవటం, గృహాల మధ్య సీసీ రోడ్లు ఏర్పాటు చేయకపోవటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లనుంచి బయటకు రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. ఇక వర్షాకాలంలో ఇళ్లకు వెళ్లాలంటే సైకిళ్లను నెత్తిన పెట్టుకొని పోవాల్సిన దుస్థితి. మోటారుబైక్‌లు వెళ్లలేని పరిస్థితి. ఇక నడుచుకుంటు వెళ్లాలన్నా బురదలో వెళ్లక తప్పదు. ఇక గృహాలు నిర్మించి దాదాపు 16ఏళ్లు కావస్తుండటంతో గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.



పగుళ్లు ఇచ్చిన గృహాలు

వసతులు లేకపోవటంతో లబ్ధిదాలు నివాసాలు ఉండకపోతున్నారు. దీంతో గృహాల నిర్వహణ అధ్వానంగా మారింది. ఇళ్ల ముందు ఉన్న మురుగు కాలువల్లో మురుగు పేరుకుపోయి రోజులు గడుస్తున్నా అడిగే నాథుడే లేడు. ఎప్పుడో ఆరునెలలకోసారి మున్సిపల్ సిబ్బంది అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంటారు. తప్పిస్తే సక్రమంగా శుభ్రం చేయటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గృహాల మరమ్మతులకు ప్రభుత్వం తగిన ఆర్థికసాయం అందించాలని లబ్ధిదాలరు కోరుతున్నారు. అంతేగాక రాజీవ్ గృహకల్ప గృహాల సముదాయం వరకు బీటీ రోడ్డు కాని సీసీ రోడ్డు కాని వేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసం ఎంతైనా ఉంది.

రెవెన్యూ స్టాంపుల కొరతతో ఇక్కట్లు

- కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దుస్థితి
- సీఎస్‌సీ సెంటర్లలో ఈ-స్టాంపులకు అక్రమ వసూళ్లు

కోసిగి, మే 2 (ఆంధ్రజ్యోతి): కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్ జ్యుడిషియల్ స్టాంపులు దొరక్కపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టాంప్ వెండర్ల వద్ద నాన్ జ్యుడిషియల్ స్టాంపులు లేకపోవడంతో కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న సీఎస్‌సీ సెంటర్లలో ఈ-స్టాంపుల కోసం నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రూ.50ల ఈ-స్టాంపునకు అదనంగా రూ.100 నుంచి రూ.200లు ముక్కు పిండి సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారని సబ్‌రిజిస్ట్రార్ బజారికి ప్రజలు ఫిర్యాదు చేశారు. సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారిపై చర్యలు తీసుకునే బాధ్యత పూర్తిగా సీఎస్‌సీ అధికారులదేనన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు స్టాంపుల కోసం వేచి ఉన్న ప్రజలు

ఆకాశాన్ని అంటుతున్న గ్రాసం ధరలు

- ట్రాక్టర్ గడ్డి రూ.18వేలు



ట్రాక్టర్‌తో తీసుకెళ్తున్న వేరుశనగ గ్రాసం

గోనెగండ్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతోంది. ఆదోని డివిజన్‌లో గ్రాసం వచ్చే పంటలు ఎక్కువగా సాగుచేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. చాలమంది రైతులు గ్రాసం కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది వరి, వేరుశనగ, పంటలను రైతులు ఎక్కువగా సాగుచేయక పోవడం చేసిన చోట గ్రాసం నల్లబడటంతో వాటి ధర విపరీతంగా పెరిగింది. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి రూ. 18 వేల వరకు పలుకుతుంది. గోనెగండ్ల మండలంలో ఆవులు, ఎద్దులు, 25,000, బర్రెలు 8000, గొర్రెలు, 90000, మేకలు 540, కోళ్లు బాతులు 30,665లు ఉన్నాయి. గ్రాసం కొరత కారణంగా బళ్లారి, ప్రాంతాల నుంచి పశువుల యజమానులు గ్రాసాన్ని దిగుబడి చేసుకుంటున్నారు. అలాగే వరి, వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసిన చోట నుంచి గ్రాసం దిగుబడి చేసుకునేందుకు పశుయజమానులు సిద్ధమయ్యారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి

పెద్దకడుబూరు, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలోని ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు శాంతియుతంగా జీవించాలన్నారు. అనంతరం సైబర్ క్రైమ్, రోడ్డు భద్రతలపై అవగహన కల్పించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఎస్ఐ

కోసిగి, మే 2(ఆంధ్రజ్యోతి): కోసిగిలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హనుమంతరెడ్డి అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ఎండలో వాహనదారుల కష్టాలు కథనానికి స్పందించి శుక్రవారం కోసిగిలో ఆర్టీసీ బస్టాండు నుంచి మార్కెండేయ స్వామి కల్యాణ మండపం వరకు ప్రధాన రోడ్లపై నిలిపిన వాహనదారులకు జరిమానాలు విధించారు. ఎవరైనా ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

కోసిగి, మే 2 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న రైల్వేగేటుకు ఇరువైపులా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సీపీఎం కోసిగి మండల కన్వీనర్ రాముడు అన్నారు. శుక్రవారం కోసిగిలో ఆయన మాట్లాడుతూ కోసిగి రైల్వేస్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకలు రోజు రోజుకు రద్దీ పెరగడంతో ప్రతి 20 నిమిషాలకు ఒకసారి రైల్వే గేటు వేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎండ వేడిమి అధికంగా ఉండటంతో ఉష్ణోగ్రతలకు వాహనదారులు అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. సంబంధిత రైల్వే, పంచాయతీ అధికారులు రైల్వేగేటు ఇరువైపులా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వేగేటు పడిన సమయంలో ఎండలు తట్టుకోలేక వాహనదారులు వడదెబ్బకు గురవుతున్నారని అన్నారు.

నీటి వృథాను అరికట్టండి



వృథాగా పోతున్న నీరు

కౌతాళం, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా తాగునీరు వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉన్నది. మండల పరిధిలోని తోవి గ్రామంలో బదినేహాల్ ఎస్ఎపీ నుంచి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే గ్రామ ముఖ ద్వార వద్ద ఏర్పాటు చేసిన కొళాయిలకు మూతలు లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కనీసం వాటికి మూతలు బిగిస్తే నీరు వృథా కాకుండా చూడవచ్చు. నిత్యం నీరు వృథాగా పోతుండటంతో రహదారి కూడా బురదమయంగా మారింది.సంబంధిత అధికారులు నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి: ఏఐవైఎఫ్

మంత్రాలయం, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 15నుంచి 18 వరకు చేపట్టిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి రాజులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగులు పెరిగిపోతున్నారని ఆరోపించారు. మతం పేరుతో రెచ్చగొడుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ప్రధాని మోదీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, బ్యాంకింగ్, ఎయిర్‌పోర్టు, ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు చిన్న, రాజు, విజయ్, ప్రాణేష్,వెంకటేష్, ఏసేబు, సందీప్, మురళి, రాజేష్ పాల్గొన్నారు.

గిరిరాజాచార్‌కు పారా విద్యామాన్య అవార్డు



గిరిరాజాచార్‌కు పారా విద్యామాన్య అవార్డు ప్రదానం చేస్తున్న ఉడిపి, పలిమార్, రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు

మంత్రాలయం, మే 2 (ఆంధ్రజ్యోతి): సంస్కృత విద్యలో ఎంతో మందిని ఉన్నతంగా తీర్చిదిద్దిన రాష్ట్రపతి అవార్డు గ్రహిత విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్‌కు ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతులు పారా విద్యామాన్య బిరుదును ప్రదానం చేశారు. శుక్రవారం ఉడిపిలోని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో పాటు పలిమార్ మఠం పీఠాధిపతి విద్యాధిశ తీర్థులు, విద్యారాజేశ్వర తీర్థులు అవార్డును ప్రదానం చేశారు. శాలువ, పూలమాల, మెమెంటో, ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. అవార్డు అందుకున్న గిరిరాజాచార్‌కు శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తిలు అభినందనలు తెలిపారు.

ఉడిపి శ్రీకృష్ణుని దర్శించుకున్న పీఠాధిపతి

మంత్రాలయం, మే 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా ఉడిపిలోని శ్రీకృష్ణ భగవానున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే సంస్థాన పూజల్లో భాగంగా మూల రాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేసి అక్కడి భక్తులను ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రవచన గోష్ఠిలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పీఠాధిపతికి పలిమార్ మఠం పీఠాధిపతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌతమాచార్, రాజాఎస్ అప్రమేయాచార్, ద్వారపాలక అనంతస్వామి, వరదేంద్రాచార్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే

కౌతాళం మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలో 139వ మే-డే వారోత్సవాల వేడుకలను సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం చిరుతాపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.. ముందు సీపీఎం జెండాను గ్రామంలో ఎగరవేసి మే-డే అవశ్యకతను తెలిపారు. నాయకులు మల్లయ్య, ఈరన్న నాగరాజు, ఉసేని, ఎల్లప్ప. కేవీపీఎస్ నాయకులు చిన్న మారయ్య, తాయప్ప, వీరేష్ అయ్యప్ప, పరసప్పలు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహం ధ్వంసం



పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

ఎమ్మిగనూరు రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఐకోండ ప్రాంతంలో ఉన్న ఆంజినేయ స్వామి విగ్రహాన్ని పట్టణంలోని ఓ సామాజికి వర్గానికి చెందిన ఇద్దరు యువకులు ధ్వంసానికి యత్నంచారు. గమనించిన స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. దాంతో యువకులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఓ యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులను వివరణ కోరగా పట్టణానికి చెందిన యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇది ఇలా ఉండగా ఆంజినేయ స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు పెద్ద ఎత్తున స్టేషన్ ముందు , శివసర్కిల్ ముందు నినదాలు చేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

మంత్రాలయం, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి జయరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మాధవరంలో స్థానిక సమస్యలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, కిరణ్ కుమార్, అంజి, ఏలియా, శివ, లారెన్స్, దేవపుత్ర, దేవరం, అంజినేయులు, పాల్గొన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- ప్రధాన రహదారులపైనే వాహనాలు పార్కింగ్
- మంత్రాలయంలో నరకం చూస్తున్న భక్తులు

మంత్రాలయం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖపుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పోలీసులు ట్రాఫిక్‌ను ఎంత నియంత్రణ చేసినా అదుపు కావడంలేదు. దీంతో భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరసగా సెలవు దినాలు రావడంతో రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ముఖద్వారం, శ్రీమఠానికి వెళ్లే ప్రధాన రహ దారి, రాఘవేంద్ర సర్కిల్, మాధవరం హైవే రోడ్డు, పోలీసు స్టేషన్ ఎదురుగా, నాగలదిన్నె రోడ్డు, బస్‌స్టాండ్ రోడ్డుకు ఇరువైపులా భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు ఆటోలు ఇష్టారాజ్యంగా తిప్పడం, భారీ వాహనాలు రవాణతో ట్రాఫి క్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు అదనపు సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చేసిన ఫలితం లేకుండా పోయింది. ప్రైవేట్ లాడ్జీలు, హోట ళ్లకు పార్కింగ్ స్థలాలు లేకపోవడం, ఆర్అండ్‌బీ రోడ్లను సైతం కబ్జాకు గురికావడంతో



ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వాహనాలు



ముఖద్వారం వద్ద అడ్డదిడ్డంగా తిరుగుతున్న వాహనాలు

ట్రాఫిక్‌కు ప్రధాన సమస్యగా మారింది. శ్రీమఠానికి వెళ్లే ప్రధాన రహదారులు, ముఖద్వారం వద్దకు ఆటోలకు అనుమతిలేకపోయినా ఎక్కడ పడితే అక్కడ నిలిపి భక్తులను ఎక్కించుకోవడం, అద్దె మాట్లాడుకో వడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారింది. ట్రాఫిక్ వ్యవస్థను చక్కదిద్ది, ఆటోలను నియంత్రించాలని భక్తులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

మంత్రాలయంలో భక్తులు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి. కబ్జాకు గురైన ఆర్అండ్‌బీ రోడ్లలో పానీపూరీ, టీకొట్లు, సోడాబండ్లు, టిఫిన్‌సెంటర్లు తొలగించాలి. ప్రైవేట్ లాడ్జీలు, హోటళ్ల పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలి. సెలవురోజుల్లో భారీ వాహ నాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం. అదనపు సిబ్బం దిని నియమించి ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తాం.

\- రామాంజులు, సీఐ, మంత్రాలయం